# అవ్యక్తం

విహారి

''గుడ్‌మార్నింగ్ మేడమ్'' అంటూ కాఫీ తెచ్చాడు శివరాం. తీసుకుంది గౌరి. మంచం పక్కన స్టూలు మీద కూచున్నాడు.

ఉదయం ఐదు గంటలకి పక్కనుంచి దిగుతూండగానే భార్య గౌరి చెవిలో మధురంగా ఊసులాడి, శుభోదయం చెప్పి, ఏదో ఓ చిలిపి పని చేసిన తర్వాతనే మంచం దిగుతాడు శివరాం. ఆ కార్యక్రమం ఈ రోజూ యధావిధిగా జరిగింది. అదనంగా ఈరోజు భార్యకి జన్మదిన శుభాకాంక్షలు కూడా చెప్పి, సుతారంగా కరచాలనం చేసి తర్వాతే కాలు కిందపెట్టాడు.

'ఇది రెండో రౌండు, కాఫీకీ, మురిపెంకీ కూడా' అని మనసులో అనుకొని భర్త వైపు అమృతపాయమైన చూపులు చూసింది గౌరి. తానూ 'గుడ్ మాణింగ్' చెప్పింది.



కాఫీ పూర్తి చేసింది గౌరి. కప్పుని అందుకొని భార్య కళ్లల్లోకి చూస్తూ సన్నగా ఈల వేశాడు శివరాం. ఉషోదయంలో విరిసిన ముగ్ధమందారంలా వుంది గౌరి. భార్యని తమకంగా చూస్తూ.

''నీల వస్తూ వుంటుంది. ఆమె రాగానే నీ స్నాన కార్యక్రమం. నా అదృష్టం బాగుండి ఆమె డుమ్మా కొట్టిందంటే, నాకు నీ పుట్టినరోజు బహుమానం. అభ్యంగస్నానం ఈ అబ్బాయి గారు చేయించే అదృష్టం లభిస్తుంది'' అన్నాడు.

గౌరి సిగ్గుపడింది. క్షణంలో ఆమె మొహాన్ని విషాదరేఖ విరిసింది. కమ్మ తెమ్మెరకి పులకించి అలతిగా వూగిన పూరెమ్మ, అంతలోనే ఎండవేడిమికి కమలినట్లయింది.

తన పట్ల భర్త శ్రద్ధకి అవ్యక్తమైన కృతజ్ఞతా భావం గౌరిది.

అల్లరి చిరునవ్వుతో ''అమ్మాయి గారికి ఇవ్వాల్టికి నలభై ఎనిమిది'' అన్నాడు. ఆమె మూడ్‌ని సరళం చేయడానికి.

''అబ్బాయి గారికి ఏభై ఏడు'' అంది గౌరి.

''అయితే రెండూ కలిపి శతమానం భవతి అన్నమాట'' అంటూ నవ్వేశాడు. గౌరి కూడా శృతి కలిపింది.

''అవును గౌరి... ఇవ్వాళ బర్త్‌డే స్పెషల్ ఏమిటి?'' అడిగాడు. 'స్పెషల్' పదంలో అర్థాంతరాన్ని మిళితం చేసి, ఒకింత కవ్వింపు కూడా ధ్వనించేటట్లు మాట విరుపుకి లోనయింది. గౌరి మొహం వివర్ణమైంది.

గౌరి దగ్గరగా కదిలి మంచం మీద కూర్చున్నాడు శివరాం. ఆమె చెక్కిలి మీద చేయి వేసి 'నో... నో... నో...' అంటూ ''సారీ'' అంటూ మరుక్షణం ఆమె మొహాన్ని తన దోసిటితో స్పృశిస్తూ అనునయంగా, 'ప్లీజ్... ఏమనుకోకు' అన్నాడు. తనను తాను కూడా సంబాళించుకున్నాడు.

అప్పటికే ఆమె కళ్లు సజలాలైనాయి. కొంగుతో తుడుచుకుంది. భర్త అనునయంతో దుఃఖమో ఆనందమో తెలియని భావోద్విగ్నతతో, ఓపలేనంత రిలీఫ్‌ని ఫీలయింది గౌరి.

కొంచెం పక్కకి జరిగాడు శివరాం. చూపులతోనే భార్య అందాల్ని సేవిస్తూ కూచున్నాడు. జ్ఞాపకాలు ముసిరినై.

ఈమె ఇద్దరు పిల్లల తల్లి అంటే ఎవరు నమ్మగలరు అనిపించింది. గౌరి బాగా ఎత్తరి. ఎత్తుకు తగిన అవయవ సౌష్టవం. దబ్బపండు మేనిచాయ. సన్నని నడుము మీద బారెడు జడ. ''గౌరీ నువ్ రోజా పూలజడ వేసుకుంటే బాగుంటుందోయ్'' అని తాను ఉడికిస్తే, ''ఆ... ఆ...తమరు తాతగారని కాస్త గుర్తుంచుకోండి. వాలుజడలూ, సింగారాల రగడలూ సాగే వయస్సు దాటి వచ్చిన స్టేషన్లలో వుంది సార్'' అని మురిపెంగా హెచ్చరిస్తూ వుండేది. ''గడుసుదనం కాకపోతే నువ్ మాత్రం అమ్మమ్మవని చెప్పుకోకూడదూ...'' అని తాను సరాగమాడేవాడు.

''మరి నేను పాకశాస్త్రం ప్రాక్టికల్స్‌కి వెళ్లనా ఇంకా?'' అని గోముగా అడుగుతూ కదిలాడు శివరాం.

సన్నగా నవ్వుకుంది గౌరి.

★★★

శివరాం, గౌరి ఇద్దరూ ఉద్యోగస్తులే. అతను పెద్ద కంపెనీలో మార్కెటింగ్ మేనేజర్. ఆమె ఒక సింథటిక్ కంపెనీలో సీనియర్ మేనేజర్. ఇద్దరు సంతానం. పెద్దది వాసంతి, రెండు రమేశ్. వాసంతి ఆమె భర్త అశోక్ ఇద్దరూ స్టేట్స్‌లో సాఫ్ట్‌వేర్ ప్రొఫెషనల్స్. రమేశ్ ఎంటెక్ చేసి ఢిల్లీలో ఉద్యోగంలో వున్నాడు. ఇంకా పెళ్లికాలేదు. వాసంతికి ఒక బాబు సాయి. వాడికి ఏడాది నిండింది. వాసంతి పురిటికి గౌరి యూరప్ వెళ్లి ఆర్నెల్లు

**గౌరి దగ్గరగా కదిలి మంచం మీద కూర్చున్నాడు శివరాం.ఆమె చెక్కిలి మీద చేయి వేసి 'నో... నో... నో...' అంటూ ''సారీ'' అంటూ మరుక్షణం ఆమె మొహాన్ని తన దోసిటితో స్పృశిస్తూ అనునయంగా, 'ప్లీజ్... ఏమనుకోకు' అన్నాడు. తనను తాను కూడా సంబాళించుకున్నాడు. అప్పటికే ఆమె కళ్లు సజలాలైనాయి. కొంగుతో తుడుచుకుంది. భర్త అనునయంతో దుఃఖమో ఆనందమో తెలియని భావోద్విగ్నతతో, ఓపలేనంత రిలీఫ్‌ని ఫీలయింది గౌరి.**

వుండి వచ్చింది. ఆ ఆర్నెల్లు తలచుకుంటేనే నైట్‌మేర్ అంటూ వుంటాడు శివరాం. 'ఆలిగల బ్రహ్మచర్యం బ్రహ్మకూడా వద్దు' అంటాడు చిత్రంగా తల విదిలిస్తూ...

గౌరి ఇండియాకి తిరిగి వచ్చిన నాలగవ రోజు- ఇక్కడే హైదరాబాద్‌లో...

మాల్‌లో షాపింగ్‌కి వెళ్లారు. మాల్‌లో ఎవరో బాంబు పెట్టారని హాహాకారాలూ, కలకలం, హడావుడి, తొక్కిసలాట. అప్పుడు జరిగిందా దుర్ఘటన.

భయంకరమైన వాస్తవం. పీడకల కాదు. కలలాంటి పీడ! జనం కాళ్ల కింద గౌరి!

బతుకు మారిపోయింది. వైద్యులు 'ఇక అంతే' అన్నారు. రోజులూ, నెలలూ గడిచిపోతున్నాయి. పరిస్థితిలో మార్పు రాలేదు. గౌరి అన్ని విధాల ఇన్‌వేలిడ్ అయింది. మంచం బతుకు మిగిలింది! ఉద్యోగం పోయింది!

శివరాం రెప్పల కింద ఉప్పెన! గౌరి గుండెలో అరల్లో తనను పసిపాపలా చూసుకుంటున్న భర్త పట్ల ఆరాధనా, అనురాగస్వర ప్రస్తారం!

బెడ్‌రూమ్‌ని, హాలునీ కలిపి విశాలమైన హాల్- కమ్- బెడ్‌రూమ్ చేయించాడు శివరాం. గౌరి పడక ఆ హాలు చివర. పగలంతా ఆమెని కనిపెట్టుకొని వుండడానికి నీల కుదిరింది.

★★★

నీల వచ్చింది. గౌరి స్నానాదికాలైనాయి.

ఈలోగా బ్రేక్‌ఫాస్ట్ సిద్ధంచేశాడు శివరాం. రైస్ సేవా ప్లేట్‌తో పాటు పాయసం కప్పు కూడా భార్యకందించాడు. తీసుకుంది. కళ్లల్లో నీళ్లు ఉబికి అక్కడే ఆగిపోయినై.

టీ తయారు చేసి తెచ్చాడు. ఇద్దరికి టీ అయింది.

నీల ఇంటి పనుల్లో వుంది. వీళ్లు మాట్లాడుకుంటూ కూర్చున్నారు. రమేశ్ పెళ్లి ప్రస్తావన వచ్చింది. మ్యారేజి బ్యూరో ద్వారా వచ్చిన సంబంధం గురించి ఎత్తాడు శివరాం. 'నీ అభిప్రాయం ఏమిటి గౌరి' అడిగాడు.

గౌరికి ఒక్కసారిగా తన స్థితి స్ఫురించింది. దుఃఖం పొంగుకొచ్చింది. తమాయించుకుంది. గొంతు పెగల్చుకొని అన్నది ''ప్రత్యేకం నా అభిప్రాయమేం వుంది. కానీ, నా పరిస్థితిని పూర్తిగా వివరంగా చెప్పి వాళ్లని ఆలోచించుకోమనండి''

ఈ మాటలని పక్కకి తిరిగి కళ్లొత్తుకుంది.

భారంగా నిట్టూర్చాడు శివరాం. 'అదేం ఫర్వాలేదు. వాళ్లేమీ ఇక్కడ మనతో ఉండబోవడం లేదుగా. ఆ రాబోయే కోడలికేమీ నీ బాధ్యత వుండదుకదా' అన్నాడు.

ఇటు తిరిగింది గౌరి. అలజడి తగ్గిన సముద్రంలా వుందామె ముఖం. ''అదంతా నిజమే అయినా చెప్పవలసిన బాధ్యత మనది అలాగే రమేశ్‌కీ మనమే ఎస్యూరెన్స్ ఇవ్వాలి. అప్పుడే వాడు మానసికంగా కంఫర్ట్ ఫీలవుతాడు'' అన్నది.

''అలాగే నువ్ చెప్పినట్లే చేద్దాం'' అన్నాడు శివరాం. ఊఁ కొట్టింది గౌరి.

ఫోన్ రింగయింది. చూశాడు శివరాం. శాండియాగో నుంచి వాసంతి. చెప్పాడు శివరాం. గౌరి కళ్లు మెరిసినై. పరామర్శల తర్వాత ఫోన్‌ని భార్యకిచ్చాడు.

వాసంతీ, అశోక్ గౌరికి గ్రీటింగ్స్ చెప్పారు. సాయి ఆటపాటల గురించీ, ముద్దు ముచ్చట్లు గురించీ చాలా సేపు మాట్లాడుకున్నారు తల్లీకూతుళ్లు. మనసు ఆనందంతో తేలిపోతోంది గౌరికి.

రాలుతున్న వడగళ్లని దోసిట పట్టుకుంటున్నట్లు ఆ మురిపాలని వింటూ కూర్చున్నాడు శివరాం.

సాయంత్రం నాలుగు దాటింది.

దగ్గరి వూర్లో శుభకార్యానికి వెళ్లాలని నీలని వాళ్లమ్మ వచ్చి పిలుచుకు వెళ్లింది.

టీ అయింది.

గౌరి మొహమెత్తి భర్తకేదో చెప్పబోతున్న దానిలా పెదవులు కదిల్చి ఆగిపోయింది. పరీక్షగా చూశాడు శివరాం. ''చెప్పు గౌరి'' అన్నాడు. ఆమె 'ఏం లేదు లెండి'' అని మౌనం వహించింది. ఏ

భావమూ తోచని ఫీలింగ్‌తో మిన్నకున్నాడు శివరాం.

సాయంత్రం ఆరుగంటలయింది.

గౌరికి స్పాంజ్‌బాత్ ఇచ్చి, తుడిచి, కొత్త గద్వాల్ పట్టుచీరని తనే కట్టబెట్టాడు శివరాం.

కొంచెం కష్టంగానే తనకు తానే జాకెట్ తొడుక్కుంది గౌరి. జుట్టు సరిచేసి వదులుగా జడ వేశాడు. భార్య లావణ్యానికి ముగ్ధుడవుతూ, నుదిటి మీద ముద్దిచ్చి, 'గుడ్, మధురం, మధురం ఈ సమయం' పాడాడు. సాహిత్య పిపాస కలిగిన భావుకుడు శివరాం మరి!

ఆనందంతో, కృతజ్ఞతతో తొట్రుపడింది గౌరి. కనురెప్పల చెమ్మ. గౌరి స్వగతంగా మెదిలే భావాలూ, శబ్దాలూ, తెలియని వాడేం కాదు శివరాం. ఆమె మౌనం కూడా అతనికి మధురభాషణమే. ఆశ నిండిన చూపులతో తన్మయం చెందాడు.

క్షణాల తర్వాత నిండు గొంతుకతో అన్నది గౌరి, 'మంచంలో మనిషికి ఇవన్నీ ఎందుకండీ?' అని.

ఠక్కున కినుకతో అన్నాడు శివరాం. 'గౌరీ.. ప్లీజ్.. అలాంటి మాటలు మాట్లాడకు...'

అతని మనసు చివుక్కుమందని అర్థమైంది గౌరికి. ఏమీ మాట్లాడలేదు. భర్త చేతుల్ని, తన చేతుల్లోకి తీసుకొని ఆప్యాయంగా ముద్దు పెట్టుకుంది.

ఇద్దరి పెదవుల మీద అనురాగ హాసం విరిసింది!

★ ★ ★

ఆ దుర్ఘటన జరిగినప్పట్నుంచీ ఇద్దరి టిఫిన్ రాత్రి ఎనిమిదిలోపే అయిపోతోంది.

ఇప్పుడు తొమ్మిది కావొస్తోంది. వంటిల్లు సర్దుకొని వచ్చి హాల్లో కూర్చున్నాడు శివరాం.

''రేపటినుంచి ఈ వంట బాధ వుండదులెండి'' అంది గౌరి. వంటావిడ సీతమ్మ కూతురి పెళ్లికని గత పదిహేనురోజుల నుంచీ సెలవు తీసుకుంది. ఇవాల్టితో ఆ గడువు తీరింది. 'కానీ... ఆమె రావాలిగా. అందులోనూ ఆడపిల్ల పెళ్లి' అన్నాడు శివరాం.

ఇంతలో ఫోన్ మోగింది. ఢిల్లీ నుంచి రమేశ్! ఉదయం నుంచీ కుదరలేదనీ, జైపూర్‌కి ఆఫీసు పనిమీద వచ్చినట్లు చెప్పి, తల్లికి గ్రీటింగ్స్ చెప్పాడు.

ఆ తర్వాత శివరాం మాట్లాడుతూ పెళ్లి సంబంధం గురించి ప్రస్తావించాడు. తమ అభిప్రాయమూ చెప్పాడు.

తండ్రి చెప్పిందంతా విని, 'చూద్దాంలే నాన్న. నేను తర్వాత చెప్తాన్లే' అని విషయాన్ని ముగించాడు.

వారం తర్వాత–

ఒక రోజు,

ఏదో పత్రిక చదువుకుంటున్న భర్తని 'ఇట్రా రండి' అంటూ దగ్గరకి పిలిచింది గౌరి. లేచి ఆమె మంచం పక్కన స్టూలు మీద కూచున్నాడు.

ఎడమ వైపు తల కింద వున్న పత్రిక ఒకటి తీసి భర్త చేతికిచ్చింది గౌరి. 'ఇది చదవండి' అంటూ మడచి వుంచిన పేజీని చూపింది. మౌనంగా పక్కకి తిరిగింది. భార్య వైపు అదోలా చూసి దాన్ని చదవసాగేడు శివరాం.

పూర్తిగా చదివిన తరువాత విషయం అర్థమైంది. గుండె బరువెక్కింది. కొన్నాళ్ల క్రితం ఏదో చెప్పబోయి సందేహాస్పదంగా వెనక్కి తగ్గిన గౌరి ప్రవర్తన స్ఫురించింది శివరాంకి.

మేధ మందు దట్టించిన ఫిరంగిలా అనిపించింది. భార్యకేసి నిశితంగా చూశాడు. ఆమె అటు తిరిగి వుంది!

''అయితే?'' అని అర్థోక్తితో ఆమె దృష్టి మరల్చాడు. గౌరి ఇటు తిరిగింది. మాటలు కూడగట్టుకుంటూ అన్నది, ''రేపు మాట్లాడుకుందాం. వెళ్లి పడుకోండి.''

క్షణాల్లో తేరుకొని, లేచి అవతలకి కదిలాడు శివరాం.

అస్థిమితంగా పక్కమీద మసలుతున్న శివరాం కళ్లముందు పత్రికలోని కథా, అందులో సంఘటనలూ మెదిలాయి. భార్య పక్షవాతంతో మంచాన పడి వుంటుంది. అన్నీ మంచంలోనే. ఆమె సంసార జీవనానికి పనికి రాదనే కారణం వలన ఆమె నుంచి విడాకులు కోరతాడు భర్త. వాళ్ల ఇద్దరు పిల్లలూ కూడా తండ్రిని సపోర్టు చేస్తారు. వాళ్లిద్దరూ పెళ్లిళ్లయి సంసారం చేస్తున్న ఎదిగిన సంతానం.

శివరాం మనసంతా వికలమయింది. ఆ రాత్రి అతని నిద్ర పోయింది! గౌరికి నిద్రలేని రాత్రులలో అది మరొక రాత్రి!

మర్నాడు పగలు యాంత్రికంగా గడిచింది. శివరాం సెలవు పెట్టి ఇంట్లోనే వున్నాడు. రాత్రి– తనంత తానుగా శివరామే భార్య దగ్గర ఆ కథ ప్రస్తావన తెచ్చాడు.

''కథ బాగుంది గౌరీ. రచయిత బాగా చేయి తిరిగిన కథకుడు. కథ ద్వారా అందిన సందేశం వలన నీ మనసులో నేనూ ఆ కథానాయకుడిలా బాధపడుతున్నానేమో అనే ఆలోచన వచ్చింది నీకు. అవునా? ఆ ఆలోచన నుంచీ, నా పట్ల నీకు కరుణ, సానుభూతీ, ఔదార్యం అన్నీ కలుగుతున్నాయి'' చెప్పడం ఆపి గౌరి వైపు చూస్తు వుండిపోయాడు. కొన్ని క్షణాల తరువాత మళ్లీ చెప్పసాగాడు. ''కథ వేరు. జీవితం వేరు గౌరీ. కథ ఒక రచయిత చేతిలో ఎటు పడితే అటు తిరిగే అవకాశం వున్న ఒక కళా స్వరూపం. ఆ రచయిత విశ్వాసాల నుంచి ముగింపు వెలువడుతుంది. జీవితం ''మనం'' అనే నువ్వు నేనూ మధ్య నడుస్తుంది గౌరీ. మూడో చేతి ప్రమేయం లేదు. మన బతుకు, మన విశ్వాసం– ఇవి మన సొంతమైనవి. వీటిని రచయిత గ్రహించకలడు. కథాత్మకంగా మలుచుకోగలడు. అంతే కానీ! అతను తానుగా అనుభవించలేడు. పాపం, రచయితలు జీవితం గురించీ రాస్తున్నామనుకుంటూ– కొన్ని నమూనాల్ని ఎంచుకొని వాటిల్లో తమ మనఃస్థితిని వర్ణించుకుంటారు. అందుకని కథలు చదివి మనం అనేక విశ్లేషణలు చేసుకోవచ్చు కానీ, నిర్ణయాలు మాత్రం మనవి మనవిగానే రావాలి.''

గౌరీ కళ్లు వర్షిస్తున్నాయి. శివరాం గొంతులో నుంచి వెలువడిన బాధ ఆమె గుండెల్లోకి చొచ్చుకుపోయింది. శివరాం పరిస్థితీ అలాగే వుంది. గౌరి ఆలోచనే అతని కంఠంలోని గాద్గద్యంగా మారింది.

ఇద్దరి మనసులూ ఉద్విగ్నమైనాయి. భార్య చేతిని తన చేతిలోకి తీసుకొని, అరచేతిని మృదువుగా నొక్కుతూ, 'పిచ్చిపిల్ల' అన్నాడు శివరాం. తనను తాను నిబ్బరించుకోలేక పైకే ఏడ్చేసింది గౌరి.

సరిగ్గా అదే సమయంలో ఫోన్ రింగయింది. ఢిల్లీ నుంచి రమేశ్. 'నాన్నా, నేను వసంతా మా పెళ్లి గురించి ఒక నిశ్చయానికి వచ్చాం. డన్. అత్త మామా కూడా మీతో మాట్లాడతామన్నారు. అమ్మకూ చెప్పు. అమ్మే తనకు అత్త కావాలని పట్టు పడుతోంది వసంత! మేనకోడలు కదా!'

స్పీకర్‌లో నుంచి అంతా విన్న గౌరి రెండు చేతులూ ఎత్తి దండం పెట్టింది. ఎవరికో మరి? క్షణాల క్రితం దుఃఖాశ్రువులు... ఇప్పుడు ఆనంద బాష్పాలు అయినాయి.

★

